

# ఇంటర్వ్యూ

వాసిరెడ్డి సీతాదేవి

నులివెచ్చని సూర్యకిరణాలు అనురాధ ముఖాన్ని చుర్రున తాకాయి. ఉలిక్కిపడి లేచి కూర్చొంది. అప్రయత్నంగానే ఆమె కళ్ళు టేబుల్ మీదవున్న టైంపీస్‌మీద నిలిచాయి. ఎనిమిదింబావు అయింది. గోడమీదవున్న క్యాలెండర్ వైపుకు మళ్ళాయి ఆమె చూపులు.

అవును! ఇవ్వాళ ఆదివారమే! సందేహంలేదు. ఇవ్వాళకూడా తను పొద్దెక్కేవరకు నిద్రపోగలిగింది!

అవును! ఈ రోజే ఇంటర్వ్యూ! అతను సరిగ్గా పన్నెండు గంటలకు వస్తానన్నాడు. ఇవ్వాళయినా పెందలకడలేచి ఇంటర్వ్యూకు తయారుకావాలనుకుంది తను. కాని త్వరగా మెలకువ వస్తేనా? అనూరాధకు తనమీద తనకే విసుగు కలిగింది.

రాత్రంతా సరిగా నిద్రలేదేమో కళ్ళు ఇసుక పడినట్లు మెరమెరలాడుతున్నాయి.

అనూరాధకు రెండు రోజులుగా ఏ పనిమీదా మనస్సు లగ్నం కావటంలేదు. ఇంటర్వ్యూలో అడగబోయే ప్రశ్నలను ఊహించుకుంటూ, వాటికి జవాబులు తనకు తానే చెప్పుకుంటూ రాత్రంతా సరిగా నిద్రపోలేదు. అయినా అనూరాధకు సంతృప్తి కలగలేదు.

గబగబా పళ్ళు తోముకుని, ఫ్లాస్కులోని కాఫీ గ్లాసులో పోసుకొనివచ్చి కుర్చీలో కూర్చుంది. తల నిండా ప్రశ్నలూ-సమాధానాలు.

తను ఇంతకుముందు ఎన్నో ఇంటర్వ్యూలకు వెళ్ళింది. అవన్నీ ఒకఎత్తు. ఈ ఇంటర్వ్యూ ఒక్కటే ఒకఎత్తు. ఆ మాటకొస్తే ఇలాంటి ఇంటర్వ్యూలు ఎంతమందికి జీవితంలో తటస్థపడతాయి! అంతటి అదృష్టం కలిగే కొద్దిమందిలో

తనుకూడా ఒక ర్తై, అనే ఆలోచన, అనూరాధను ఆనందంలోముంచి ఉక్కిరి బిక్కిరి చేసింది.

"ఏమిటే పిల్లా! కాఫీగ్లాసు చేత్తో పట్టుకొని తపస్సు చేస్తున్నావ్!

అనూరాధ చివ్వున తలెత్తిచూచింది. ఎదురుగా కర్రపోటుమీద వంగిన నడుమును కొంచెం పైకెత్తటానికి ప్రయత్నిస్తూ, అనూరాధ అమమ్మ నిల్చొని వుంది.

"అమ్మమ్మోయ్!" అనూరాధ కంఠంలో సంతోషం కంచుగంటలా మ్రోగింది.

"ఏమిటే పిల్లా అంత కేరింతలు కొడుతున్నావ్! ఏదైనా కథ రాశావా? ఇప్పుడు నీ కథ వినే ఓపిక లేదే పిల్లా!" అంది అనూరాధ అమ్మమ్మ బోసిబోసిగా నవ్వుతూ.

అనూరాధకు వళ్ళు మండిపోయింది.

అమ్మమ్మ మహా గడుసుమనిషి! ఆమెను కథ ఏదైనా చెప్పమని అడగటం పాపం. ఆగకుండా గంటలకొద్దీ చెప్పుకుపోతుంది! తను రాసిన కథ ఏదైనా వినమంటే ములగచెట్టు చిటారుకొమ్మ ఎక్కి కూర్చుంటుంది! ఎంతో బ్రతిమాలించుకొని కాని వినదు. తీరా విన్నాక ఎలా వుందో చెప్పటానికి కాసేపు ఏడిపిస్తుంది!

నువ్వు గడ్డం పుచ్చుకొని బతిమాలినా ఇవ్వాళ నీకు కథ వినిపించను. అసలు నీతో మాట్లాటానికే నాకు తీరిక లేదు. నన్ను పలకరించకుండా వుండు. అంతేచాలు!" అంది అనూరాధ ఉక్రోషంగా.

"ఏమిటే నా తల్లీ! అంత కోపం వచ్చింది! ముందు కాఫీ తాగు! కథ వింటాలే" అంటూ కర్ర పక్కనే పెట్టకొని నేలమీద ఎదురుగా కూర్చుంది బోసినోటని ముడుచుకొని.

"కోపం కాదమ్మమ్మా! నిజమే చెబుతున్నాను. నేను ఒక ఇంటర్వ్యూకు తయారుకావాలి" అంది అనూరాధ.

"ఇంటర్వ్యూ ఏమిటి? ఈ ఉద్యోగం మానేస్తున్నావా?" అంది అనూరాధ తల్లి పార్వతమ్మ.

అనూరాధ పెదవులపై చిరునవ్వు లాస్యం చేసింది.

"అది కాదమ్మా! నన్ను ఇంటర్వ్యూ చెయ్యటానికి ఒకాయన మనింటికి వొస్తున్నారు. మధ్యాహ్నం కాఫీ, ఫలహారాలు చెయ్యాలి నువ్వు!" అంది అనూరాధ.

అనూరాధ తల్లి అర్థంకానట్లు చూసింది. అమ్మమ్మ తలపైకెత్తి బోసినోటిని తెరచేసింది.

"అదేం ఉద్యోగమే అమ్మాయ్ నాకు తెలియకడుగుతాను? ఇంటికొచ్చి ఇంటర్వ్యూచేసి ఇచ్చే ఉద్యోగాలు కూడా వుంటాయా? ఉద్యోగంకూడా ఇంట్లో వుంటే చేసుకోవచ్చా?" అంది పార్వతమ్మ ఆశ్చర్యంగా.

అనూరాధ పకపకా నవ్వింది.

"ఇవ్వాళ ఇంటర్వ్యూ ఉద్యోగం యివ్వటానికి కాదమ్మా! నా గురించి పేపర్లో రాయటానికి ఇంటర్వ్యూ చేస్తారు."

పేపర్లోనా? ఎందుకూ?" తలమునకలయే ఆశ్చర్యంలో పడిపోయింది పార్వతమ్మ.

అనూరాధ అమ్మమ్మ కళ్లు తేలేసింది.

అనూరాధకు ముఖంమీద చన్నీళ్లు చిలకరించి నట్లయింది. అమ్మమీద, అమ్మమ్మమీదా చిర్రెత్తుకొచ్చింది. తన గురించి పేపర్లో యెందుకురాస్తారో కూడా వూహించలేరేం? రచయిత్రుల పరిచయం పడటం ఆలస్యం తనకంటే ముందు అమ్మే ముందు చదివేస్తుందిగా? అమ్మమ్మకు తను ఎన్నిసార్లు ఇలాంటి పరిచయాలు చదివి వినిపించలేదు? వీళ్లు కూడ తననొక రచయిత్రిగా గుర్తించరు- ఇక మామయ్య సరేసరి?" ముందు కొన్నిమంచికథలు చదువు. ఆ తరువాత రాద్దువుగాని" అంటాడు. కృష్ణవేణి కూడ ఆ మాటే అంటుంది. అందుకే వాళ్ళతో ఎప్పుడూ తన కథల్ని గురించి చర్చించదు. ఇంటర్వ్యూ పేపర్లో పడ్డాక ఇక వాళ్లు నోరు కూడా యెత్తరు!

మామయ్య థియరీ తనకు బొత్తిగా అర్థంకాదు. తను కథలు రాయాలంటే, ఎవరో రాసిన కథలెందుకు చదవాలో? తను రాసిన కథలు అచ్చుకావటంలేదూ? ఎంతమంది పాఠకులు ప్రశంసిస్తూ ఉత్తరాలు రాయటంలేదు? ముఖ్యంగా తనురాసిన "తెగిపోయిన తీగలు", "విరిగిపోయిన వీణ"కు పాఠకులనుంచి పుంఖానుపుంఖంగా ఉత్తరాలు వచ్చాయి.

---

ఒక ఆసామి తనభార్యను వెంటబెట్టుకొని డాక్టర్ దగ్గరికొచ్చాడు.

డాక్టర్: "ఏమిటిజబ్బు?" ఆమెవైపు పరీక్షగా చూచినతర్వాత భర్తను అడిగాడు.

భర్త: ఏమీలేదండి! ఈమధ్య వారం రోజులనుంచి మా ఆవిడ "కొక్కొక్కో" అంటూ ఇంటిచుట్టూ తిరుగుతుంది. అందుకని....

డాక్టర్: మరి ఇప్పటివరకు ఆలస్యం జేశారేం?

భర్త: గుడ్డుపెడుతుందేమోనని....సిగ్గుపడుతూ చెప్పాడు.

---

అనూరాధ తల్లి అలాగే నిల్చొనివుంది కూతురి ముఖంలోకిచూస్తూ.

"నేను కథలు రాస్తానుగదూ? అందుకే నన్ను ఇంటర్వ్యూచేసి నా గురించి పేపర్లో రాస్తారు." అంది అనూరాధ నీరసంగా.

"నిజంగా? నా తల్లే! చూస్తుండగానే ఎంత గొప్ప దానివైపోయావమ్మా!" అంది పార్వతమ్మ మురిపెంగా కూతుర్ని చూసుకొంటూ.

ఇంకేం? జవాబులు బాగా చెప్పు" అంది అమ్మమ్మ.

అరుంధతి చేతిలోని గ్లాసు అందుకొని పార్వతమ్మ అక్కడనుంచి వెళ్ళిపోయింది. ముసలమ్మ కర్రపోటు వేసుకుంటూ వరండాలోకి వెళ్ళిపోయింది. అనూరాధ వాలుకుర్చీలో వెనక్కువాలి ఆలోచనల్లోకి జారిపోయింది.

సరిగ్గా 'ధర్'గారు పన్నెండుగంటలకు వస్తానన్నారు. బహుశా ఫొటోగ్రాఫర్నికూడా తీసుకొస్తారు. ఫోటోతోసహా తనగురించి పేపర్లో వస్తుంది. అప్పుడుగాని తన గొప్పతనం తనచుట్టూ వున్నవాళ్ళకు తెలియదు!

"ఫస్ట్ ఇంప్రెషన్ ఈజ్ ద బెస్ట్ ఇంప్రెషన్" అంటారు. ధర్‌గారు వచ్చేప్పటికి ఏదైనా ఇంప్రెస్ చేసేపనిలో తను లీనం అయివుండాలి!

"నేను వెళ్ళేప్పటికి అనూరాధగారు ఫలానా పనిలో నిమగ్నులైవున్నారు. దీనినిబట్టి వారికిగల ఫలానా అభిరుచి అర్థం అవుతుంది" అంటూ రాస్తారు ధర్‌గారు.

బాగానే వుంటుంది! కాని ఏం చెయ్యాలో ఎంత బుర్ర బద్దలుకొట్టుకున్నా తోచి చావటంలేదే?

ఏదైనా ప్రఖ్యాత, అదే ప్రపంచ సాహిత్యంలో పేరుపొందిన పుస్తకం చదువుతూ కూర్చుంటే? అది చూసి ఆయన ప్రపంచ సాహిత్యంలో పేరు పొందిన కొన్నిపుస్తకాలమీద తన అభిప్రాయాన్ని అడిగితే? తను చచ్చిందే! మామయ్య ఇందుకే కాబోలు మంచి పుస్తకాలు ఎక్కువగా చదవమనే వాడు!

పుస్తకం చదువుతూ కూర్చోవటంలో ప్రత్యేకత ఏముందిలే!

ఇన్ని తెల్లకాగితాలను ముందేసుకొని ఏదైనా కొత్త కథ ప్రారంభిస్తే? ఐడియా అమోఘంగా వుంది. "నేను వెళ్ళేసరికి అనూరాధగారు రచనా వ్యాసంగంలో మునిగిపోయి వున్నారు. నా ఆగమనాన్ని కూడా ఆమె గమనించలేదు" అని రాస్తారు.

అబ్బే బొత్తిగా బాగుండదు. అది చదివిన పాఠకులు, ధర్‌గారు వస్తున్నట్లు తెలిసికూడా తనురాస్తూ కూర్చోవటాన్ని ఒక పోజ్‌గా అనుకుంటారు.

తోటపనిలో నిమగ్నురాలై వుంటే? గొప్పవాళ్ళందరికీ తోటపని స్వయంగా చేసికోవటం హాబీఅట! కాని తన ఇంటిముందుకానీ, వెనగ్గానీ తోటలేదే! ఛ! ఛ! ఏం కొంప? అద్దెకొంప! అందులో రెండు గదులు మాత్రమే. ఇంటికి ముందుకానీ వెనగ్గానీ చారెడు స్థలంలేదు.

కాని తన ఇంటికి టెర్రస్ వుందిగా? పైకివెళ్ళి పచార్లుచేస్తూ, ప్రకృతి సౌందర్యాన్ని తిలకిస్తూ మైమరచి వున్నట్లు చేస్తే? తనలోని సౌందర్య పిపాసనుచూచి ధర్ ముగ్ధుడైపోడే?

అనూరాధ, ఇంత సేపటికి తనకు అంత మంచి ఆలోచన తట్టినందుకు తనను తనే అభినందించుకున్నది.

కాని...అతను వస్తుంది మధ్యాహ్నంపన్నెండు గంటలకు. అప్పుడు డాబామీద పచార్లు చెయ్యటం ఏమిటి? పైగా వర్షాకాలం అన్నాకాదు. మండు వేసవికాలం! తనకు పిచ్చిపట్టిందనుకుంటాడు! అయినా వచ్చే మనిషి ఏ సాయంకాలమేవస్తే ఎంత బాగుండేది? మధ్యాహ్నం రావటం ఏమిటి?

అనూరాధకు ధర్ మీద చిరాకువేసింది.

ఆ! ఒకటిచేస్తే? తను ఇంత చదువుకున్నా, ఇంటిపనంటే వంటచేయటమంటే యిష్టం అని తెలియపర్చే పనేదయినా చేస్తే?

అవును! అతను వచ్చేప్పటికి వంటింటి గది

పీలో కత్తిపీటమీద కూర్చొని కూరగాయలు తరిగితే: బాగానే ఉండవచ్చు. ఇంట్లో ప్రొద్దున సూరమ్మత్త వంపించిన సొరకాయ ఉంది దొడ్లో కాసిన సొర కాయ నవనవలాడుతోంది. సొరకాయ తరగటం చాల తేలిక. కళాత్మకంగా తరగవచ్చుకూడా!

"నేను వెళ్ళేప్పటికి అనూరాధగారు వంటింటి గుమ్మంలో కూర్చొని కత్తిపీటమీద లేతలేత సొర కాయలు కోస్తున్నారు. ఆ ముక్కల్ని ఎంతో ఆర్టిస్టిక్‌గా తరుగుతున్నారు. దాన్ని పట్టి వారు చేసే ప్రతిపనీ ఎంత కళాత్మకంగా వుంటుందో వ్యక్తం అవుతుంది' అని రాస్తాడు.

ఏడ్చినట్టుంది! ఛ! లేత లేత సొరకాయలు తరగటం ఏమిటి? అడదై పుట్టి వంటచేయటం గూడ ఓ గొప్ప పనేనా? పైగా పన్నెండు గంటల వేళ కూరగాయలు తరుగుతూ కూర్చోవటం ఏమిటి? అది చూస్తే అమ్మమ్మ ముందుగానే చెవులకు తాటాకులు కట్టదే?

మరి! ఇన్నిటికీ ఏం చెయ్యాలి? నుదురు అర చేత్తో రుద్దుకుంటూ ఆలోచించసాగింది అరుంధతి.

అన్నట్టు ఆమధ్య ఓ ప్రఖ్యాత రచయిత్రి ... ప్రఖ్యాత ఏమిటిలే...ఓ రచయిత్రి చెప్పిందిగా?

"నాకు అన్నిటికంటే మా శ్రీవారికి ఎదురుగా కూర్చుని కబుర్లు చెప్పటం ఇష్టం! ఇంటి సమస్యలు మా శ్రీవారితో చర్చించటం నాకు సరదా! మా శ్రీవారంటే నాకు వల్లమాలిన గౌరవం!" అంటూ చెప్పింది గదూ?

కాని తనకు అలాంటి అవకాశం లేదే? తను అంతవరకూ వివాహం చేసుకోనందుకు మొదటి సారిగా బాధ కలగింది అనూరాధకు. మళ్ళీ తన మనస్సును తనే ఓదార్చుకొన్నది.

అదేం గొప్ప విషయం కనక తను బాధపడాలి శ్రీవారితో కబుర్లు చెప్పటం కూడా ఓ ఘనకార్యమేనా? ఇంటి సమస్యలు శ్రీవారితో కాక మరెవరితో చర్చిస్తారు ఎవరు మాత్రం? అయినా ఇంటి సమస్యలు చర్చించటం కూడా సరదా ఏమిటి? బూడిద! ఎవరి శ్రీవారంటే వారికి గౌరవం కాక, ఊళ్ళో వారి శ్రీవార్లమీద వుంటుందా? అంత వున్నా చెప్పుకోగల ధైర్యం ఎంతమంది గృహిణులకు వుంటుంది కనక?

పోనిద్దూ! పాఠకులు తెలుసుకోవాలని ఉబలాట పడేది తనను గురించి కాని తన శ్రీవారిని గురించి కాదుగా!

ఎం. యస్. ధర్‌గారు వచ్చేప్పటికి ఏం చేస్తూన్నట్లు నటించాలో అనూరాధకు బుర్ర బద్దలు కొట్టుకున్నా అంతుచిక్కలేదు.

అనూరాధ విసుగ్గా లేచింది. స్నానం చేసి భోజనంచేసి రోజూకంటే సింపుల్‌గా వుండాలని చేసుకున్నా మేకప్‌కు రోజూకంటే ఓ అర్ధగంట ఎక్కువే పట్టింది. అనూరాధ ఇంట్లోకి బయటకీ ఆలోచనల్ని వెతుక్కుంటూ తిరగసాగింది.

"ఏమిటేపిల్లా అట్లా ఇంటోకి బయటకూ కాలు కాలిన పిల్లిలా తిరుగుతున్నావ్?" అంది అప్పుడే భోజనంచేసి, గడపమీద తలపెట్టుకుని పడుకొని వున్న అనూరాధ అమ్మమ్మ.

అమ్మమ్మ పలకరింపుతో అనూరాధకు ఓ అమోఘమైన ఐడియా వచ్చింది.

ధర్‌గారు వచ్చేప్పటికి అమ్మమ్మతో కబుర్లు చెబుతూ కూర్చుంటే? ఓహో! బ్రహ్మాండం! అమ్మమ్మలతో కబుర్లు చెప్పటం ఇష్టమనీ. అమ్మమ్మల కాలంనాటి విషయాలు వినటం సరదా అనీ. ఆ మాటకొస్తే అమ్మమ్మల్లా మాట్లాట్టం, ఆలోచించటం, తనకు ఎంతో ఇష్టమనీ చెప్పవచ్చును. ఉషారుగా ఒక్కదూకులో అనూరాధ అమ్మమ్మ దగ్గిర కొచ్చింది.

"అమ్మమ్మా?"

"అమ్మమ్మోయ్!"

అమ్మమ్మ ఉలకలేదు. పలకలేదు. గురక మాత్రం వినిపించింది. ఈ ముసలాళ్ళతో వచ్చిన చిక్కే ఇది. రాత్రిళ్ళు నిద్రపోరు, నిద్రపోయేవాళ్ళ ప్రాణాలు తోడేస్తారు దగ్గులతో. నసతో. పగలు మాత్రం హాయిగా కునుకులు తీస్తారు!

"అమ్మమ్మోయ్?" అమ్మమ్మను కుదుపుతూ పెడబొబ్బ పెట్టింది.

కళ్ళు నింపాదిగా తెరిచింది అమ్మమ్మ.

"ఏమిటే అమ్మాయ్ ఆ బొబ్బకేకలు! నీ కథ గానీ ఏ పేపర్లోనైనా అచ్చయిందా ఏం?" అడిగింది అమ్మమ్మ బోసిబోసిగా, తొసిబోతూనవ్వుతూ.

అమ్మమ్మకుకూడా తన కథలంటే ఎగతాళే! అనూరాధకు ఏడుపువచ్చినంత పనయింది.

"హల్లో రాధా! ఎక్కడికో ప్రయాణం అయినట్టున్నావ్?" అప్పుడే ప్రవేశించిన కృష్ణవేణి ప్రశ్నించింది.

"రా కృష్ణా! మంచి సమయానికే వచ్చావ్?" అంది అనూరాధ సంతోషంగా.

ధర్‌గారు వచ్చేప్పటికి స్నేహితురాలితో కబుర్లు చెబుతూ కూర్చొనే అవకాశం లభించినందుకు అనురాధ తేలిగ్గా నిట్టూర్చింది.

"సినిమాకు వెళదామా?" కృష్ణవేణి ప్రశ్నించింది.

ఇవ్వాళ వద్దులే!"

"ఏం? ఎక్కడికెళుతున్నావ్?"

"ఎక్కడకు వెళ్ళడం లేదు."

"మరి ఈ ముస్తాబు?"

"పెద్ద ముస్తాబేముందిలే! యం. యస్. ధర్ గారు వస్తున్నారు."

"ఆయ నెవరు?" ఆశ్చర్యంగా ప్రశ్నించింది కృష్ణ.

"పేరుకూడా విన్లేదూ? అవునులే నువ్వుతెలుగు పత్రికలు చదువవుగా! ఎం. యస్. ధర్ రచయితల్ని, రచయిత్రుల్ని ఇంటర్వ్యూ చేసి, వారి గురించి పత్రికల్లో రాస్తూంటారు ఆయన...ఆయనే వస్తున్నారు." అనూరాధ కంఠంలో గర్వం ధ్వనించింది.


"ఎందుకూ?"

అనురాధకు అమాంతం స్నేహితురాల్ని మింగేయాలనిపించింది.

ఎందుకేమిటి? నన్ను ఇంటర్వ్యూ చెయ్యటానికి!" అనురాధ స్వరం కొంచెం చురుగ్గా వుంది.

"అదా సంగతి? నువ్వుకూడా కథలు రాస్తావుగా? ఆ సంగతి నా కసలు గుర్తే వుండదు సుమా? నేనుకూడా చూస్తాను, ఇంటర్వ్యూ ఎలా జరుగుతుందో!" అంది కృష్ణవేణి.

కృష్ణవేణి పుస్తకాలు తెగచదువుతుందని అనూ



రాదసు తెలుసు.

నాలుగు పుస్తకాల పేర్లూ - రచయితల పేర్లూ తెలిసి పెట్టుకోవటం ఎందుకయినా మంచిదేమో!

"జేమ్స్‌బాండ్ రాసిన రెండు మంచి పుస్తకాల పేర్లు చెప్పు కృష్ణా?" అంది అనూరాధ.

కృష్ణవేణి కళ్ళను వెడల్పుచేసి అనూరాధను చూస్తూ వుండిపోయింది.

"ఏమిటలా చూస్తావ్? నువ్వు పుస్తకాల పురుగువుగా? ఆ మాత్రం తెలియదూ?" ఇంత కాలానికి కృష్ణవేణిని దెబ్బకొట్టగలిగినందుకు ఆనందిస్తూ అంది అనూరాధ.

కృష్ణవేణి మరోసారి అనూరాధ ముఖంలోకి చూసింది జాలిగా. "నిన్ను అందుకే పుస్తకాలు చదవమంటాను. జేమ్స్‌బాండ్ రచయిత పేరుకాదు. ఇయాన్ ఫ్లెమింగ్ అనే రచయిత సృష్టించిన పాత్ర పేరు జేమ్స్‌బాండ్" అంది కృష్ణవేణి.

అనూరాధకు మూర్ఛ వచ్చినంత పనయింది.

"మరి ఆ మధ్య ఓ రచయిత్రి తన అభిమాన రచయితల పేర్లు చెబుతూ జేమ్స్‌బాండ్ పేరుకూడా చెప్పింది!" ఎలాగో అనగలిగింది అనూరాధ.

"ఆమె నీలాగే జేమ్స్‌బాండ్ పేరు మాత్రం విని వుంటుంది." అంది కృష్ణవేణి అతి సాధారణంగా.

అనూరాధకు మరేమీ అడగాలనిపించలేదు. మౌనంగా కూర్చుండి పోయింది.

"నారాయణరావు గురించి నీ అభిప్రాయం అడిగితే ఏం సమాధానం చెబుతావు?" అంది కృష్ణవేణి.

"ఏ నారాయణరావు? ఆయన ఏమేమి పుస్తకాలు రాశాడు?" కాళ్ళకింద నిభూమిమీద నిలబడటానికి ప్రయత్నిస్తున్నట్లు ప్రశ్నించింది అనూరాధ.

కృష్ణవేణి విరగబడి నవ్వింది. అనూరాధ పిచ్చి చూపులు చూసింది.

"'నారాయణరావు' నవల పేరు. అడివి బాపిరాజు గారు రాశారు." అంది కృష్ణవేణి అతి కష్టంతో వస్తున్న నవ్వును దిగమింగుకుంటూ.

వెలవెలబోతున్న ముఖంలోకి గాంభీర్యాన్ని తెచ్చిపెట్టుకుంటూ "అవును! చాలాకాలం క్రితం ఆ పుస్తకం చదివినట్లు గుర్తు. బాపిరాజుగారి పేరు నాకు చాలా ఫెమిలియర్‌గావుంది. మరీ అంత అజ్ఞానిన్ని అంటావ్టకు. ఆయన యం. ఎల్. ఏ. కూడా గదూ?" అంది అనూరాధ.

"నీ తలకాయ!" అప్రయత్నంగానే అనేసింది కృష్ణవేణి.

అసలే చిన్నగా వుండే అనూరాధ ముఖం మరీ చిన్నదై చింతాకులా కనిపించింది. ఆ ముఖం చూస్తుంటే అనూరాధకు జాలీ, నవ్వూకూడా కలిగాయి.

"ఇక నువ్వు రచయితల గురించీ, పుస్తకం గురించీ ఇతరుల ముందు మాట్లాడకుండా వుంటేనే మంచిది. అడవి బాపిరాజుగారు చనిపోయి చాలా కాలం అయింది. ఆయన రచయితేకాదు, పెద్ద కళాకారుడు" కూడా అంది కృష్ణవేణి.

అనూరాధ ముఖం తెల్లకాగితమే అయింది.

నిజంగానే ఈ పుస్తకాల గురించీ, రచయితల గురించీ ఇప్పటికిప్పుడు తెలుసుకోవాలంటే వున్న మతికాస్తా పోయేలా ఉంది. ఇంకా నయం! కృష్ణ కనక సరిపోయింది! అదే మరొకరయితే ఎంత నగుబాటు అయేది తనపని?

వాకిట్లో అలికిడి అయింది. అనూరాధ ఆలోచనల నుంచి బయటపడింది. గబుక్కున లేచి వాకిట్లోకి వచ్చింది. ఒడ్డూ పొడుగూ వున్న ఒక యువకుడు భుజానికి 'కెమెరా' తగిలించుకొని నిల్చొని వున్నాడు. అనూరాధకు ఓ క్షణం గుండెలు దడదడ లాడినట్లనిపించాయి.

"అనూరాధగారు...?"

"నేనేనండీ? రండి! కూర్చోండి!" తడబడుతూ అంది అనూరాధ.

కృష్ణవేణిని పరిచయం చేసింది. నమస్కారం చేసి కూర్చున్నాడు ధర్.

"మిమ్మల్ని డిస్టర్బ్ చేశానా?" భుజానికి తగిలించివున్న కెమెరాను చేతిలోకి తీసికుంటూ ప్రశ్నించాడు.

"అబ్బే! అదేంలేదండి! మీ కోసమే ఎదురు చూస్తూ కూర్చున్నాం" అనేసి నాలుక కరచుకుంది అనూరాధ.

"చాలా థాంక్స్!" అన్నాడు కళ్ళనిండుగా కృతజ్ఞతా భావాన్ని నింపుకొని.

అతను అంత వినయ విధేయతలు చూపించటం ఎందుకనో అనూరాధకు అంతగా నచ్చలేదు.

"మీకు అభ్యంతరం లేకపోతే మీ ఫొటో

# మామూలు మనిషికి మార్ఫియా

గుండె
భార్యా, గంపెడు బిడ్డలూ
బాధలూ చిక్కుపడిన దారాలూ
బరువులూ కన్నీళ్ళూ
వీటిచేత పరివేష్టించబడి
బ్రతుకు యేటికి ఎదురుగా సాగుతూనే వుంది.

కలల నిద్ర—
అకస్మాత్తుగా రాలే పారిజాత విరులకోసం,
అందలం మీది ఆనందంకోసం
అర్రులుచాచి కలవరిస్తూనే వుంది.

మనస్సు—
మనసుమాత్రం నిద్రలేక, కలలు రాక
పరిగెడుతూంది....
కూర్చోడం మరిచిపోయిన తల్లక్రిందు పక్షిలాగ!....
పక్కింటి మేడమీది చక్కటి కొత్తకోడలు కొంగుల్లోకీ
సుబ్బరాజా బహదూర్ వారి ఓడవాళ్లలోని విస్కీసీసాల్లోకీ;
ఆఫీసరుగారి ఖరీదైన సీటులోకీ
ఆనందం నిలబడిన చోటులోకీ
పరిగెడుతూంది మనస్సు.

ఆంజనేయస్వామి కోవెల్లోని కొబ్బరిపెచ్చుల్లోకీ
హారతి కర్పూర పరిమళాల్లోకీ;
నాయుడుగారి నల్ల చెవర్లెట్ కారులోకీ
చాకెట్ల పాకెట్లలోకీ కాప్స్టన్ సిగరెట్లలోకీ
పరిగెడుతూంది మనస్సు.
బీచ్‌లోకీ - బజారులో మిఠాయి దుకాణానికీ
మాగాణీపొలాల మధ్యకీ;
మంగరాజు ఎవరికోసమో కుడుతున్న టెర్లిన్ జతల్లోకీ;
బూట్లలోకీ - నోట్లలోకీ
అందమైన అజంతా హోటల్లోకీ....
చివరకి అంగారక గ్రహంలోకీ
పరిగెడుతూంది మనస్సు, వేగంగా - వేవేగంగా
పరిగెత్తే వేగం ఇంకా సరిపోవడం లేదని
విచారిస్తూంది మనస్సు.

— ఆకొండి వెంకటరత్నం

ఒకవే తిఎంటాను.

అనూరాధకు మొహమాటంగా వుంది.

"దానికేం? తీసుకోండి!" అంది కృష్ణవేణి.

ధర్ గారి కళ్ళు సంతోషంతో మిలమిల లాడటం చూసింది కృష్ణవేణి

అర్ధగంట తాను చెమటలు కక్కి, అనూరాధచేత నురగలు కక్కించినంతపని చేసి, చివరకు కెమెరా స్విచ్ నొక్కాడు. "అమ్మయ్య!" అనుకుంది కృష్ణవేణి

ధర్ జేబులోంచి ఆటోగ్రాఫ్ పుస్తకం తీసి అనూరాధకు అందించబోయాడు అనూరాధ అర్థం కానట్టు చూసింది.

తనను ఇంటర్వ్యూ చెయ్యటానికి వచ్చి ఆటోగ్రాఫ్ అడుగుతాడేం?

యాంత్రికంగానే అందుకొని సంతకం పెట్టి ఇచ్చింది. అతను అతి వినయంగా, కళ్ళనుంచి భక్తి భావాన్ని గుమ్మరిస్తూ అందుకున్నాడు

అతని రచనల్లోని గిడుసుదనం ప్రవర్తనలో కనిపించదేం? తన ఎదుట అంత వినయంగా వుండాల్సిన అవసరం అతని కెందుకో?

కృష్ణవేణి మౌనంగా కూర్చొని కుతూహలంగా చూస్తోంది.

"మీ అభిమాన రచయితలు ఎవరో తెలుసుకోవచ్చా అండీ?"

చప్పున తలెత్తి ధర్ ముఖంలోకి చూసింది అనూరాధ. ముందు తన పుట్టుపూర్వోత్తరాలు అడక్కుండానే అభిమాన రచయితల గురించి అడుగుతాడేం?

"నాకు అభిమాన రచయితలంటూ ఎవరూ లేరు. నేను అసలు ఎవరి రచనల్నీ చదవను." తడుముకోకుండా జవాబిచ్చింది అనూరాధ.

కృష్ణవేణి విస్తుపోయి చూసింది. పోనీయ్ లే విషయం చెప్పేసి బ్రతికిపోయింది అనుకుంది.

"అలాగా? కారణం?"

"కారణం ... ఇతరుల రచనలు చదివితే వారి ప్రభావం నా రచనలమీద పడుతుందని నాభయం. అది నేను సహించను" ఎలావుంది నా జవాబు అన్నట్టు అనూరాధ కృష్ణవేణి ముఖంలోకి చూసింది.

"చాలా బాగుంది! ప్రశంసనీయమైన అభిప్రాయం!" అంటూ ధర్ అనూరాధ అభిప్రాయాన్ని నోటుబుక్కులో నోట్ చేసుకొన్నాడు.

"మీ సమకాలీన రచయిత్రుల గురించి మీ అభిప్రాయం?" కొంచెం ముందుకు వంగి ప్రశ్నించాడు ధర్.

"ఎవరి మీదా నాకు సదభిప్రాయం లేదు. ఎవరూ బాధ్యతతో రాయడంలేదు." నిస్సంకోచంగా అనేసింది అనూరాధ.

కృష్ణవేణి కళ్ళు పెద్దవి చేసుకొని చూసింది. అనూరాధ ధైర్యానికి ఆశ్చర్యంవేసింది.

"ఎవరి రచనలూ చదవనని ఇప్పుడేగా అన్నావు? అలాంటి నీకు ఎవరేం రాస్తున్నారో ఎలా తెలుసు?" అనేసింది కృష్ణవేణి.

అనూరాధ కృష్ణవేణిని చుర చుర చూసింది.

ధర్ కృష్ణవేణి మాటకు విలువ ఇవ్వనట్టే "మీ హాబీ?" అని అడిగాడు.

అప్పుడే "హాబీ"దాకా వచ్చాడేం? తన రచనా వ్యాసంగాన్ని గురించి అడగడేం?

"తోటపని చెయ్యటం. ప్రాచీన గ్రంథపఠనం!" తడుముకోకుండా అనేసింది అనూరాధ.

ధర్ నోట్ బుక్ లో రాసుకున్నాడు శ్రద్ధగా.

"చాలా బాగుందండీ! మీరు ఏఏ ప్రాచీన గ్రంథాలు చదివారో సెలవిస్తారా?" వెన్నకంటె మృదువైన కంఠంతో ప్రశ్నించాడు. చక్కెరకంటె తియ్యని చిరునవ్వును పెదవులకు పులుముకొని.

"భారతం, భాగవతం, రామాయణం క్షుణ్ణంగా చదివాను. మళ్ళీమళ్ళీ చదువుతూనే వున్నాను" అంది అనూరాధ కృష్ణవేణి ముఖంలోకిచూస్తూ.

కృష్ణవేణి కళ్ళప్పగించి చూస్తూవుండిపోయింది

"ఆధునిక సాహిత్యంకంటే మీకు ప్రాచీన సాహిత్యం అంటే ఎక్కువ మక్కువ అన్నమాట!"

"చిట్టినాయనా కవిత్వంలో మాట్లాడుతున్నాడు!" అనుకున్నది కృష్ణవేణి.

"అవునండీ! నాకు ప్రాచీనత అంటే మహా అభిమానం ప్రాచీన సాహిత్యమేకాదు. ప్రాచీనమైనది ఏదైనా నాకు అభిమానమే. ఆమాటకొస్తే "ఆధునికం" అనే శబ్దంకంటె "ప్రాచీనం" అనే శబ్దమే నా చెవులకు ఇంపుగా వినిపిస్తుంది. ఆధునిక భావాలూ, ఆధునిక వేషభాషలూ, ఆధునిక సంస్కృతీ... ఏవన్నా నాకు అసహ్యమే. అందుకే ఆధునిక రచయితల్ని ఎవర్నీ నేను చదవను." అంది అనూరాధ

"బాగుంది! చాలా బాగుంది. మీ అభిప్రాయాలు చాలా గొప్పగా వున్నాయి." అంటూనే గబగబా ఆమె అభిప్రాయాలను నోట్ బుక్ లో రాసుకున్నాడు.

"నీ బొందలా వున్నాయి." వళ్ళుమండిన కృష్ణవేణి మనస్సులోనే అనుకొంది.

"నువ్వు రామాయణ భారతాలను క్షుణ్ణంగా చదివావా? ఏ భాషలో? ఇంగ్లీషులోనా?" కృష్ణవేణి అనూరాధను నిలదీసినట్లు అడిగింది

అనూరాధ జవాబుకోసం ధర్ ఆమె కళ్ళలోకి చూశాడు. అనూరాధ గొంతుకు పచ్చి వెలక్కాయ అడ్డం పడ్డట్టే అయింది.

"నీ ప్రశ్నలకు జవాబులు తరువాత చెబుతా లేవోయ్!" అంటూ, ధర్ వైపు తిరిగి "మీరు ఏమీ అనుకోకండి ధర్ గారూ! మా ఫ్రెండూ నేనూ ఎప్పుడూ జోక్స్ వేసుకుంటూనే వుంటాం. అది నాకు ఆడబిడ్డ వరస అవుతుంది." అంది అనూరాధ తాపీగా.

కృష్ణవేణి అనూరాధ సమయస్ఫూర్తికి మనస్సులోనే మెచ్చుకుంది.

కుర్చీ చివరకు జరిగి, కొంచెంగా ముందుకు వంగి, నోట్ బుక్ తెరచి రాయటానికి సిద్ధంగా కూర్చొని ధర్ ప్రశ్నించాడు. "మీరు సాహిత్యానికి ఓ ప్రయోజనం ఉండాలంటారా?"

"తప్పకుండా! కళ కళకోసంకాదు. ప్రయోజనం కోసం!"

"మీరు ప్రయోజనం దృష్టిలో ఉంచుకొనే రాస్తున్నారా?"

"అవును! నా రచనలవల్ల ఓ చిన్నారి పాపాయి మారినా నా జన్మ ధన్యం అయినట్లు భావిస్తాను."


"అదేమిటోయ్? చిన్నారి పాపాయి మారటం ఏమిటి" వస్తున్న నవ్వును పెదవులమధ్యబంధిస్తూ అంది కృష్ణవేణి.

అనూరాధకు తాను తాటికిలా పెరిగి కృష్ణవేణిని అమాంతం మింగేయాలనిపించింది. ధర్ అసలు ఆ మాటలు విన్నట్టేలేదు నోట్ బుక్ లో అనూరాధ అభిప్రాయాలను నోట్ చేసుకోవటంలో మునిగిపోయి వున్నాడు.

"రచయిత్రులు ఈవిషయాన్ని విస్మరిస్తున్నారు! బాధ్యతారహితంగా రాస్తున్నారు." అంది అనూరాధ.

"పోనీయ్ నువ్వొక్కదానివైనా ప్రపంచాన్ని ఉద్ధరించటానికి కంకణం కట్టుకున్నావు. అంతే చాలు!" అనుకొంది కృష్ణవేణి. పైకే అనాలనుకుంది. అనూరాధ మరీ ఏడ్చిపోతుందని ఊరుకుంది.

"రచయిత్రులంతా బాధ్యతారహితంగారాస్తున్నారంటారు?" క్వశ్చెన్ మార్కు ముఖం పెట్టి అన్నాడు ధర్.



"అవును:" జంకూ గొంకూ లేకుండా అనేసింది అనూరాధ.

కృష్ణవేణికి వళ్ళుమండిపోయింది.

"నీ 'తెగిపోయిన తీగెలూ', 'విరిగిపోయిన వీణా' అనే కథలు చౌకబారు ప్రేమకథలేగా? అవికూడా ప్రయోజనం కొరకే రాశానంటావా?" అనేసింది కృష్ణవేణి.

అనూరాధకు ముచ్చెమట్లు పట్టినంత పనయింది. ధర్ ముఖంలోకి చూసింది. అతనికి ఇదేమీ పట్టినట్టులేదు. అనూరాధనే రెప్పవెయ్యకుండా చూస్తున్నాడు. అనూరాధ ఇబ్బందిగా కుర్చీలో కదిలి మళ్ళీ నిటారుగా కూర్చుంది.

"మీరు ఇంతవరకూ వివాహం చేసుకోకపోవటానికి కారణం?"

అనూరాధ ఉలిక్కిపడి చూసింది ధర్ ముఖంలోకి.

ఇదేమిటి? సాహిత్యం గురించి ఒక్క ప్రశ్నా అడగడేం? తన వివాహంగురించి అడుగుతాడేం? అనూరాధకు ఏం జవాబు ఇవ్వాలో చటుక్కున తోచలేదు.

'మా అనూరాధకు ఓ మంచిమొగుణ్ణి చూడండి. పెళ్ళి చేసేద్దాం?' నాలుకవరకూ వచ్చిన మాటల్ని ప్రయత్నపూర్వకంగా మింగేసింది కృష్ణవేణి.

"వివాహం చేసుకుంటే నా సాహిత్య సేవకు ఆటంకం కలుగుతుందేమోనని నా భయం" అనేసి నాలుక కరచుకొంది అనూరాధ.

కృష్ణవేణి ముఖమంతా కళ్ళుచేసుకొని చూసింది.

"ఈ విషయంలో మీ అభిప్రాయంతో నేను ఏకీభవించను. మీ భర్తగారి అండదండల్లో మీ సాహిత్య వ్యాసంగాన్ని మూడు పువ్వులూ, ఆరు కాయలుగా, పెంపొందించుకోవచ్చు. కనీసం ఫెయిర్ కాపీలయినా చేసిపెడతారుగా? ఆయనకూ సాహిత్య వాసన వున్నట్లయితే ఇంకామంచిది. ఇద్దరూ కలిసి ఎంచక్కా బోలెడన్ని కథలు రాసుకోవచ్చు." అన్నాడు కళ్ళతో ఆరాధనను కడవలతో నీళ్ళు గుమ్మరించినట్లు గుమ్మరిస్తూ.

"ఏంబాబూ! నీకింకా పెళ్ళికాలేదా?" అనుకున్నది కృష్ణవేణి మనస్సులోనే.

అనూరాధ మౌనంగా, ఇబ్బందిగా కూర్చొని వుంది.

"మీకు భగవంతుడిమీద నమ్మకమేనా?"

'లేదు' అనబోయి 'ఉంది' అనేసింది,

"రోజూ ఓగంట ఇంట్లోనే పూజచేసుకుంటాను" అంది.

"పచ్చి అబద్ధం!" కృష్ణవేణి అనుకుంది.

"చాలా థాంక్సు. నాకీ అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞుణ్ణి" అంటూ కుర్చీనుంచి లేవబోయిన ధర్‌ను వారిస్తూ అంది అనూరాధ.

"రెండు నిముషాలు కూర్చోండి!"

అనూరాధ లోపలకు వెళ్ళి ఫలహారం పళ్లాలతో తిరిగి వచ్చింది.

"ఇప్పుడివన్నీ ఎందుకండీ?" అన్నాడు ధర్ ముడుచుకొనిపోతూ.

"పరవాలేదు. తీసుకోండి!" అంటూ ఫలహారం ప్లేటు అతని ముందు వుంచింది అనూరాధ.

కృష్ణవేణికి ఒక ప్లేటు అందించి తనొక ప్లేటుతో కూర్చుంది. ముగ్గురూ మౌనంగా ఫలహారం చేస్తున్నారు.

ఇంటర్వ్యూ తను అనుకున్నదానికంటే బాగానే జరిగింది. కాని తన జీవిత విశేషాలూ, రచనా వ్యాసంగం గురించీ తెలుసుకోనే లేదు. మరి ఎలా రాస్తాడు! ఊహించి రాస్తాడేమో? ఏదైనసరే వుంది. తన సమాధానాలే తన నమ్మకాలకు వ్యతిరేకంగా వున్నాయి. మిగతాది ఆయన ఊహించి రాస్తాడు.

"మీ మొదటి కథ ఏ సంవత్సరంలో వచ్చింది" మౌనభంగం చేస్తూ ప్రశ్నించాడు ధర్.

ఆలోచనలనుంచి పూర్తిగా బయటపడకుండానే "1953" అంది అనూరాధ.

"క్షమించండి! మీ వయస్సెంత?"

"మీకంటే చిన్నదే. ఏం మారేజ్ ప్రొపోజల్ పెట్టిగాని కదలదలచుకోలేదా?" పెదవుల వరకు వచ్చిన మాటల్ని బయటపడకుండా జాగ్రత్తపడింది కృష్ణవేణి.

"ఇరవై ఎనిమిది" అని బనా అనాలనుకొని "ఇరవై మూడు" అని అనేసింది అనూరాధ.

కృష్ణవేణి పిచ్చిచూపులు చూసింది.

"మీ మొదటి కథ ఇతివృత్తం?"

"ప్రేమకథ. ఒక ప్రసిద్ధ వారపత్రికలో అచ్చయింది. చాలామంది పాఠకుల అభిమానాన్ని చూరగొన్నది" అంది అనూరాధ

"అంతేకాదు ఆ కథ చదివి ఇద్దరు ముగ్గురు పసిపాపాయిలు కూడా మారిపోయారట." అంది వళ్ళుమండిన కృష్ణవేణి. తీరా అన్న తర్వాత అనూరాధ చిన్నబుచ్చుకున్న ముఖం చూసి, ఎందుకన్నానా అని బాధ పడింది కృష్ణవేణి.

"బాగుందండీ! ఆ కథపేరు?" అన్నాడు ధర్.

"తెగిపోయిన తీగెలు!" నీరసంగా ఉంది అనూరాధ స్వరం. అనూరాధ అవస్థచూసి కృష్ణవేణి 'ఎందుకొచ్చిన బాధ' అనుకుంది.

"నేను చదువలేదు. కాని చాలా గొప్ప విషయం! మీరు ఎనిమిదో ఏటనే పాఠకుల మన్ననలను పొందగలిగిన ప్రేమ కథను రాశారంటే సామాన్య విషయం కాదు. ఎంత మేధాసంపత్తి కావాలి?" అన్నాడు ధర్.

అనూరాధ గొంతులో తింటున్న పకోడీ అడ్డంపడింది పొలమారటం వల్ల. ఉక్కిరిబిక్కిరి అయిపోయింది.

"మంచినీళ్ళు తాగు" అంటూ కృష్ణవేణి మంచినీళ్ళ గ్లాసును అందించింది.

కాఫీలు తాగారు. అతను లేచి నిలబడ్డాడు ఇద్దరికీ నమస్కరించి "శెలవిప్పించండి!" అన్నాడు ధర్.

"ఈ ఇంటర్వ్యూ ఏ పత్రికలో వస్తుందండీ?" అని అడిగింది కుతూహలంగా కృష్ణవేణి.

ధర్‌గారు అయోమయంగా చూశారు. అనూరాధ జవాబుకోసం ఆత్రంగా చూసింది.

"బహుశా మీరు పొరపడిఉంటారు." అన్నాడు ధర్ ఏదో ఆలోచిస్తూ.

"మరి ఈ ఇంటర్వ్యూ దేనికి చేశారు. ఆశ్చర్యంతో ప్రశ్నించింది కృష్ణవేణి.

"నేను అనూరాధగారి అభిమాన పాఠకుణ్ణి. ఈ ఊరు వచ్చానుకదా ఓ సారి ఆమెగారి దర్శనం చేసుకుందామని వచ్చాను. ఈఊళ్ళో మామయ్య వున్నారు. ఫ్రీ రైల్వేపాసు వుంది. ఓ సారి చూసిపోదామని వచ్చాను. బహుశా మీరు నన్ను యం. యస్. ధర్ అనుకుంటారనుకుంటాను. నేను యం. జి. ధర్‌ను. అంటే నా పూర్తిపేరు గిరిధర్. ఇంటర్వ్యూలుచేసే ఆయనపేరు "యం. శ్రీధర్" అన్నాడు గిరిధర్ ఉరఫ్ యం. జి. ధర్.

అనూరాధ కాళ్ళకింద జరుగుతున్నట్లున్న నేల మీద బలంగా నిలబడటానికి ప్రయత్నిస్తోంది.

"మరి ఇంటర్వ్యూ ఇవ్వమని అడిగారు ఆ రోజు ఫోన్‌లో?" నూతిలోనుంచి వచ్చినట్లువచ్చాయి అనూరాధ గొంతులోనుంచి మాటలు.

"అదే...అంటే తమతో కలుసుకొనే అవకాశం ఇవ్వమని అడిగాను."

అనూరాధ సడలిపోతున్న నరాలను కూడదీసుకుంటూ నిలబడటానికి సతమతమై పోతుంది.

"మరి ఫొటోకూడా తీసుకున్నారు?" కృష్ణవేణి ధర్‌వైపు జాలిగా చూస్తూ ప్రశ్నించింది.

"నా అభిమాన రచయిత్రుల ఫొటోలను సేకరించటం వాటిని ఆల్బంలోఅమర్చటం నా హాబీ!" అన్నాడు గిరిధర్.

"ఇంకానయం జేబులో, గుండెలకు దగ్గరగా పెట్టుకోవటం నా సరదా అన్నారుకాదు!" అనబోయి మానేసింది కృష్ణవేణి.

"ఏదో ఒకటి ఏడ్వు! ఇక్కడనుంచి కదలు ముందు." అరివాలని పించింది అనూరాధకు.

"వస్తానండీ!"

"మళ్ళీ రావటంకూడా ఎందుకు!" అనుకుంటూ "మంచిది వెళ్ళిరండి!" అంది విసుగ్గా అనూరాధ.

"ఒక్కరిక్వెస్టు!"

అనూరాధ విసుగ్గాచూసింది. జిడ్డుగాడులా వున్నాడు అనుకుంది కృష్ణవేణి.

"ఈసారి మీరు రాసే కథలో నా గురించికూడా కొద్దిగా రాయండీ?" అన్నాడు అతిశయంగా.

"ముందు ఇక్కడనుంచి పోవయ్యా బాబూ?" అనాలనిపించింది అనూరాధకు.

"అలాగేలెండి. ఒకవేళ అది మర్చిపోయినా నేను జ్ఞాపకం చేస్తాను." అంది కృష్ణవేణి వస్తున్న నవ్వును ఆపుకుంటూ.

కృతజ్ఞతాసూచకంగా కృష్ణవేణికి మరోసారి నమస్కరించి బయటకు నడిచాడు గిరిధర్.

అనూరాధకు ఏడుపొస్తుంది. ఖాళీప్లేట్లూ, కప్పులూ గ్లాసులూ జాలిగా ఆమె ముఖంలోకి చూశాయి. అవి అనూరాధకు మరీ అవమానంగా అనిపించింది.

నీళ్ళుకారిపోతున్న అనూరాధను చూస్తుంటే ఎక్కడలేని జాలి పుట్టుకొచ్చింది కృష్ణవేణికి.

"ఇంకా మ్యాట్నీకి టైం వుంది. బయలుదేరు. 'ఆత్మవంచన' బాగుందట." అంది కృష్ణవేణి.

ఇంటర్వ్యూను గురించిగానీ, గిరిధర్ గురించిగానీ ఇద్దర్లో ఏ ఒక్కరికీ మాట్లాడాలని అనిపించలేదు. ★